పక్కవాళ్ళ సమాధి మీద, తన జీవిత సౌధం పునాది వేసే చదువుకున్న, ఫ్యాషనబుల్ మేన్ ఈటర్స్ వున్నారు సమాజంలో. చిక్కుకునేదాకా తెలీనంత చమత్కారంగా వుంటుంది వీళ్ళ వేట!

# మేన్ ఈటర్

పి.బి. కృష్ణమూర్తి



ఆఫీసరుగారి రూములోంచి బయట కొచ్చాను.

అందరి కళ్ళు నా మీదే వున్నాయి.

వెళ్ళి నా సీట్లో కూర్చున్నాను.

"ఏం గురూగారు! మాతాజీ దండకం చదివిందా?"

పక్క సీట్లోని ప్రతాపరావు ప్రశ్న.

"ఇంటర్నేషనల్ ఉమెన్స్ ఇయర్ గదటండీ మరి! తమ ఆధిక్యతను మళ్ళీ మళ్ళీ ప్రదర్శించే అవకాశం మాట మాటకు వస్తుందా మరి."

ఎదురు సీట్లోని ఏకాంబ్రేశ్వరరావు గారి కామెంటు.

"ఇంతకు ఏం జరిగింది?" రెండు సీట్ల అవతలి టైపిస్టు చారుమతి ప్రశ్న.

హెడ్ గుమాస్తా హింగోరాని తన సీటు దగ్గర్నుంచే అడిగాడు "క్యాహువా హైజీ...."

ఓ సారి అందరి ముఖాలు కలయ జూను.

ఆత్రుత.

జరిగింది తెలుసుకోవాలని తపన,

వాళ్ళు ఊహిస్తున్నది నిజం కావాలని కోరిక.... చచ్చేకోరిక. మామూలుగా జరిగేదేమిటంటే....

కళకళలాడే ముఖాలతో ఆఫీసరుగారి రూంలోకి వెళ్ళి, కళాకాంతులు లేకుండా, శవాకారాల్తో బయటపడటం మా అందరికీ అలవాటు.

గత సంవత్సరంగా అంటే రుక్మిణీదేవి గారు మా ఆఫీసు ఇన్‌ఛార్జిగా వచ్చిన దగ్గర్నుంచి.

ఆమె అతి స్ట్రిక్టు మనిషి.

పనిలో ఏ మాత్రం అజాగ్రత్తగాని, బద్ధకంగాని చూసినా మొహం పేలిపోయిందన్న మాట.... బాంబుల్లాంటి మాటలతో ఆమె ఆశీర్వచనాలు ఎప్పుడో ఒకప్పుడు గాని, తరుచుగాగాని పొందనివాళ్ళు మా ఆఫీసులోని ఎనభై రెండు మందిలో ఒక్కళ్ళూ లేరు.

ఆమె ఈ ప్రవర్తన్ను గురించి మాలో చాలామంది చాలా రకాలుగా ఊహిస్తుంటారు. ఆమె భర్త చండశాసనుడని, ఈమెగార్ని కుక్కిన పేనులా ఉంచుతాడని.

ఆఫీసరన్న ఏమాత్రం గౌరవం చూపించకుండా, ఆమె భర్త ఈమెని సగటు తెలుగువాడు సామాన్యంగా తన భార్యను ఎలా చులకనగా చూస్తాడో అలాగా చూస్తాడని.

అందువల్ల ఆమె తన కోపాన్ని, అక్కసును మా ఆఫీసులోని మగ జాతి మీద తీర్చుకుంటుందని రకరకాల అభిప్రాయాలు.

"ఏం గరూగారు చాలా గొప్ప ఆలోచనలో పడ్డారే...."

సీనియర్ అసిస్టెంట్ సర్వేశ్వరరావు గారు.

ఇక బయటపెట్టక తప్పదనుకున్నాను.

"సాయంత్రం వాళ్ళింటికి టీకి రమ్మన్నారు ఆఫీసరుగారు.." అన్నాను బింకంగా.

ఎందుకంటే. ఇది వాళ్ళకు పిడుగు పాటులా ఉంటుంది.

ఈ షాక్ వాళ్ళని ఎంతలేదన్నా ఓ అరగంటయినా అశక్తుల్ని చేసుంది. మరి ఇలాంటి విశేషం రుక్మిణీదేవిగారు మా ఆఫీసరయ్యాక కనీ వినని ది.

"వాట్...." చారుమతి ఎగిరిపడింది సీట్లో.

"మూర్తిగారి రొట్టె విరిగి కల్తీలేని నేతిలో పడింది" సర్వేశ్వరరావు. మా సేల్సు రిప్రెజెంటేటివ్. ఏడవలేక అన్న మాటలు.

"క్యా క్యా...." హింగోరానికి సరిగ్గా అర్థం కాలేదు. అర్థమయ్యేలా చెప్పాను.

"గురూగారు. ఈ మధ్యాహ్నం అందరి టేబిల్ మీదే ఫుట్ చెయ్యాలి." ఎక్కణ్నుంచి ఊడిపడ్డాదో ఎప్పుడు ఊడిపడ్డాడో మరి. బొడూకని గోప్. కాలేజీనుంచి నేరుగా మా ఆఫీసులోనే జొరబడ్డాడు. గోప్ ద హిప్పీ. వాళ్ళనాన్న ఊళ్ళో గొప్ప పలుకుబడి ఉన్న ఆసామియే మరి! ఇరవై ఏళ్ళన్నా దాటని గోప్ మా ఆఫీసులో జూనియర్ ఆఫీసరు. మాట్లాడేది తెలుగే అనిపించినా ప్రతి రెండోమాట ఇంగ్లీషు అందులో ప్రతి మూడోమాట. అసందర్భంగా అన్నా వుంటుంది. లేదా వుచ్చారణ ఘోరంగానైనా వుంటుంది వుదాహరణకు "హిపోక్రసీ"ని "హైపోక్రసీ" అంటాడు. "ఫ్లవర్ వాస్"ని "ఫవర్ వేజ్" అంటాడు. మరి వానాకాలం చదువులామె!

"గురువుగారు ఆహ్వానం సతీ సపుత్ర సమేతంగానా, లేక...." ప్రతాపరావుగారి ప్రశ్న

చుట్టూ చూశాను.

మిడతలు చుట్టు ముట్టాయి.

కాకుల్లా కావ్ కావ్ మంటున్నారు.

ఆఫీసరుగారి గది తలుపు తెరుచుకుంది

రుక్మిణీదేవిగారు.

ఎక్కడివాళ్ళు అక్కడ బొమ్మల్లా ఉండిపోయారు.

"ఏమిటో ముఖ్యమయిన సమావేశం జరుగుతున్నట్లుందే."

"నిశ్శబ్దం."

"ఏదన్నా సంతాప సభ జరుగుతోందా."

మళ్ళీ నిశ్శబ్దం.




'ముగ్గుతో ముచ్చట!'

—చిత్రం : కుందనపు నాగార్జున, నూజివీడు

దమ్ముల్లెవరికున్నాయి జవాబు చెప్పటానికి. ఎవరి సీట్లలోకి వాళ్ళు వెళ్ళారు.

రుక్మిణీదేవిగారు తన గదిలోకి వెళ్ళారు.

"మేన్ ఈటర్" గోప్.

"కలకత్తా కాళి" ఏకాంబ్రేశ్వరరావు

ప్రతాపరావు "ఇదేం ఆడది గురు."

"మన పాలిట దయ్యం...." సన్నగా ఓ మూలనుంచి వినబడింది. మరి ఆ స్వరం ఎవరిదో.

* * *

ఆ సాయంత్రం ఆరున్నరకల్లా రుక్మిణీ దేవి గారింటికెళ్ళాను.

పులిలాంటి అల్సేషియన్ అరుపులతో స్వాగత మిచ్చింది.

'రాణీ' అంటూ ఓ చిన్న అబ్బాయి, ఐదారేళ్ళు ఉంటాయేమో, వచ్చాడు.

చూడ ముచ్చటగా ఉన్నాడా బాబు.

రాణి అరుపులాపి ఆ బాబు పక్కకు చేరింది.

"హలామ్ డూయు వాంట్ ప్లీజ్."

కాన్వెంట్ లో చదువుకుంటున్నాడు కాబోలు, చక్కని. స్పష్టమైన వుచ్చారణ. అనుకొని గోప్ గుర్తుకొచ్చాడు.

"రుక్మిణీ దేవిగారువున్నారా? అన్నాను.

"రండి లోపలికి" అని దారి తీశాడు బాబు

వెనకాల రాణీ.

ఆ తర్వాత నేను.

"ప్లీజ్ సిట్" అని "మమ్మీ" అంటూ

లోపలకు పరుగెత్తాడు బాబు.

రెండు మూడు నిముషాల తర్వాత రుక్మిణీదేవిగారు వచ్చారు. "హలో-అన్న టైము కల్లా వచ్చారే." అని, నేను నిల్చోడం చూసి "కూర్చోండి.... కూర్చోండి.." అని నా కెదురుగా ఉన్న సోఫాలో కూర్చున్నారు.

"రుక్కూ" అంటూ ఓ మధ్య వయస్కుడు గబగబా లోపలకు వచ్చాడు. మమ్మల్ని చూసి "ఓ సారీ...." అని లోపలకు వెళ్ళబొయ్యాడు.

"ఫర్వాలేదు రండి. వీరు మూర్తిగారు మా ఆఫీసులో పని చేస్తున్నారు. మూర్తిగారూ వీరు రుక్మిణీపతులు రంగనాథ్ ఇన్‌కంటాక్సు ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు." రంగనాథ్‌గారు వచ్చి నా పక్కన కూర్చున్నారు.

కాసేపు అవీ, ఇవీ మాటాడి పని ఉందంటూ లోపలకు వెళ్ళిపోయారు రంగనాథ్‌గారు.

"మూర్తిగారూ, నన్ను ఆఫీసులో అంతా కలకత్తా కాళి అని ముద్దుగా పిలుస్తుంటారు కదూ." నవ్వుతూ అడిగారు రుక్మిణీదేవిగారు.

ఏకాంబ్రేశ్వరరావు గుర్తుకొచ్చాడు. మానవుడు ఏం చేస్తున్నాడో అనుకున్నాను. అయినా ఈవిడ గారికి ఇవన్నీ ఎలా తెలుస్తున్నాయబ్బా....! ఏమో మరి!

"నేను మిమ్మల్ని బాగా స్టడీ చేశాను. మీరు స్మార్టేకాదు. క్లెవర్ హెడెడ్ అని కూడా నా అభిప్రాయం. అందుకే మీతో కొన్ని ఆఫీసు సంగతులు మాట్లాడ్దామని ఇలా పిల్చాను."

అమ్మబాబోయ్ ఈవిడకు మస్కా కొట్టడం కూడా వచ్చన్నమాట. నేను స్మార్టే అయితే ఇలా కాగితాలు ఖరాబు చేస్తూండటం దేనికంట. నేను ఓ మామూలు అసిస్టెంట్‌ని. ఒక వేళ ఆవిడ అన్నది నిజమేనేమో! ఎంతవుంది తెలివైనవాళ్ళు, నాలాంటివాళ్ళు, కాలం ఖర్మం కలసిరాక అనామకుల్లా అఘోరించటంలేదు!

టీ ట్రే చప్పుడయింది.

రాణి అరుపు.

బాబు, రంగనాథ్‌గారు ఏదో వాదించుకుంటున్నట్లున్నారు.

వాళ్ళ మాటలు సన్నగా వినబడ్తున్నాయి.

"చూడండి మూర్తిగారు, ఈ రోజుల్లో నిజాయితీగా బతికేవాళ్ళకు, నిజం కుండబద్దలు కొట్టినట్లు చెప్పేవాళ్ళకు అన్నీ కష్టాలే. నన్నే తీసుకోండి మన ఆఫీసుకు ఆఫీసరుగా నాకు కంపెనీవాళ్ళు కొన్ని బాధ్యతలు అప్పజెప్పారు. అవి తు. చ. తప్పకుండా నేను పాటించటం, నా స్టాఫ్ అంతా అలాగే వుండాలనుకోవటం తప్పంటారా?" టీ కప్పు నా ముందు పెట్టి అన్నారు రుక్మిణీదేవిగారు.

నేనేం మాట్లాడ లేదు. ఆమె అంటే నాలో పాతుకుపోయిన భయం ఇంకా వదల్లేదు.

టీ తాగటం మొదలెట్టాను.

"చూడండి మూర్తిగారు. మనది ప్రైవేటు కంపెనీ. లాభాలొస్తేనే కంపెనీ. పని చేసేది లాభాలు రావాలంటే మనందరం కష్టపడి పనిచేయాలి! ఈ మాత్రం మీకు తెలీదని నేననుకోను. తెలీందల్లా ఎందుకిలాగ బాధ్యతారహితంగా, బద్ధకంగా వ్యవహరిస్తున్నారాని. ఎవరిజీతాలు వాళ్ళు ప్రతినెలా ముప్పయిన ఠంచనుగా పుచ్చుకుంటున్నప్పుడే చెప్పించుకోకుండా పనులు ఎందుకు చేయరాఅని ఎంత బుర్ర బద్దలు కొట్టుకుంటున్నా అర్థం కావటంలేదు!"

ఆమె చెప్పుకు పోతూంది .... నేను వింటూ వున్నాను. మధ్య మధ్యలో నిజమే అంటున్నాను.

వింటున్నాను, అయినాఆలోచిస్తున్నాను ఈవిడగారు ఇదంతా నాకు....నాకే ఎందుకు చెబుతున్నారా అని ఆలోచిస్తున్నాను.

అయినా వూహకందడంలేదు.

టీ తాగాను ఎదురుగావున్న ప్లేటులోని స్వీట్లన్నీ ఊదిపారేశాను పరధ్యాన్నంగా.

తన సంగతి చెబుతున్నారు రుక్మిణీదేవిగారు.

తనెంత కష్టపడిది. స్వయంకృషితో ఎలా ఆఫీసరయిందీ....రంగనాథ్ ఎంత తెలివైనవాడో, నిజాయితీపరుడో.

చెప్పటం ముగించి, ప్రశ్నలు మొదలెట్టారు రుక్మిణీదేవిగారు. నా చదువు గురించి, నేను ఆఫీసులో ఎప్పుడు చేరిందీ నా భార్య సంగతి, పిల్లల గురించి... రకరకాల ప్రశ్నలు- అన్నిటికీ జవాబులు చెబుతున్నాను.

ఈ సారి వాళ్ళింటికి నన్ను సతీ సపుత్ర సమేతంగారమ్మని ఆహ్వానం అందచేశారు.

అలాగే అన్నా.

టైము చూశాను. ఎనిమిదన్నరయింది. లేచి నిల్చొని "ఇహ శలవిప్పిస్తారా" అన్నాను చేతులు జోడించి.

"ఉండండి. డ్రైవరుని పిల్చి మిమ్మల్ని ఇంటి దగ్గర దించమని చెప్తాను."

"ఎందుకండీ శ్రమ" అన్నాడు సిగ్గుపడ్తూ. లోలోపల హాయిగా కారులో వెళ్ళామనే వుంది.

"ఇందులో శ్రమేముంది కారుని నేనొచ్చి నెట్టడం లేదుగా" నవ్వుతూ అన్నారు రుక్మిణీదేవిగారు.

గుడ్‌నైట్ చెప్పి బయటపడ్డాను.

దోవలో, ఇంటికి వచ్చాక కూడా రుక్మిణీదేవిగార్ని గురించిన ఆలోచనలే.. ఆమె చెప్పిందాంట్లో అసత్యం వున్నట్లు అనిపించలేదు. మరి ఆఫీసంతా ఏకమై ఆమెను ఎందుకలా దుయ్యబట్టడం.... రకరకాల పేర్లు పెట్టడం.... ఆడదనా?

మర్నాడు అందరితో మాట్లాడుదామనుకున్నాను.

* * *

మర్నాడు ఆఫీసులో లంచవరులో టీకి కేంటీనుకు వెళ్ళబుద్ధవలేదు.

చిన్నా, పెద్ద తేడా లేకుండా, నేను మాట్లాడిన ప్రతివాడు నన్ను కడిగి వదిలిపెట్టాడు.

నేను కలకత్తా కాళి కబంధ హస్తాల్లో చిక్కుకుపొయ్యానట! ఇవ్వాళ కాకపోయినా, రేపైనా నేను ఆ మేన్ ఈటర్‌కి మేత నైపోతానట.

విడదీసి రాజ్యం ఏలే ప్రణాళికలో ఇది మొదటి మెట్టట!

ఒకటనికాదు, నోటికొచ్చిందల్లా వాగారు ఎంత నచ్చ చెప్పినా ప్రయోజనం కనబడలేదు. చివరికి విసిగి "గోటూ హెల్" అన్నాను. నన్ను పురుగును చూసినట్లు చూసి వెళ్ళారు అంతా కేంటీన్ వైపు.

ఒక్క చారుమతి మాత్రం మిగిలింది.

తన టైప్ రైటరు పక్కకు జరిపి, ఆ చోటులో లంచి బాక్సు తెరిచి "రండి" అని నన్ను పిల్చింది.

వెళ్ళాను.

ఇడ్లీ కారంపొడి.


ఫొటోగ్రఫీ

(తెలుగు ద్వైమాస పత్రిక)

జనవరి 1979 సంచిక వెలువడింది.

ఈ సంచికలో శరీరమ్ముపై ఫొటోగ్రఫీ రసాయనిక పదార్థాల ప్రభావం-వాటి నివారణోపాయం, లెన్సులకు ఫంగస్ వాటి నివారణ, బిగినర్సు పేజీ, ఫొటోలు తీస్తున్న తార, ఇది "ఫొటోయిజం" (శ్రీమతి పొన్నులూరు పద్మావతి) సోలరైజేషన్, ఛాయాచిత్ర ప్రదర్శనలు-యస్. వీరయ్య వార్తలు, విశేషాలు.

సం॥ చందా రు. 9/-

రెండు సం॥ చందా రు. 16/-

పి. బి. నెం. 38, చీరాల-523 155.



"సంక్రాంతి గంగిరెద్దు మేళం"

—చిత్రం : కోరా శ్రీనివాసరావు, గుంటూరు

ముక్క తీసి నోట్లో పెట్టుకోబోయాను.

"దొరసానిగారు పిలుస్తున్నారు" ప్యూన్ వచ్చి చెప్పి వెళ్ళాడు.

తింటం ఆపి ఆమె గదిలోకి వెళ్లాను.

చూసున్న ఫైల్లోంచి తలెత్తి నా వైపు చూసి, "కూర్చోండి" అని కుర్చీ చూపించారు.

కూర్చున్నాను.

నా ముందుకు తను చూస్తున్న ఫైలుని నెట్టారు ఫైలు తెరిచాను. హెడ్డాఫీసునుంచి వచ్చిన ఫైలది. అంకెలమయం.

చివ్వరమటుకు ఎర్రని అక్షరాలలో వుంది. ఈ గడిచిన ఆరునెలల్లో కంపెనీ ప్రాఫిట్సు గత ఏడాదితో పోల్చి చూస్తే ఎనిమిది శాతం తగిపొయ్యాయట. కారణాలు వివరించి ఉన్నాయి ఆ ఫైలులో.

పరిస్థితి మెరుగుబడాలంటే ఎలాంటి స్టెప్పు తీసుకోవాలో పేర్చి వున్నాయి. అలా జరగని పక్షంలో ఈ సంవత్సరం పూర్తి కాగానే ఆఫీసుని మూసి వేయడం జరగవచ్చని రాసింది.

చివరగా ఈ ఆఫీసులో యూనియన్ పెటాలని స్టాఫ్‌కి ఆలోచన వున్నట్లు వార్తలందాయని, నిజమేనా అని, నిజమె అయితే దానికి ముఖ్య కారకు లెవరో కనుక్కొని తమకు తెలియజేయవలసిందిగా రాసుంది.

ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో యూనియన్ ప్రారంభించి దాని ద్వారా స్టాఫ్ ఎక్కువ జీతాలు, భత్యాలు అడగడం ప్రారంభిస్తే, మా ఆఫీసు పరిస్థితి ఎంత అధ్వాన్నమవుతుందో వివరించి రాసుంది.

ఫైలు ఆమెకందిచ్చాను.

"చూశారా మూర్తిగారు, పరిస్థితి ఎంత దారుణంగా ఉందో" అన్నారు రుక్మిణీదేవిగారు.

ఆమె నిన్న నాతో చెప్పింది గుర్తుకొచ్చింది.

అందరి మేలుకోసం అందరం కష్టపడి పని చేయటం ఎంత అవసరమో తెలిసి వచ్చింది. ఆమెకు మా శ్రేయస్సే ముఖ్యం కనుక ఆఫీసు రహస్యాలుకూడా చెబుతున్నారు అనుకొన్నాను.

"మీరు ఈ విషయంలో ఏం దిగులు పెట్టుకోవద్దు.

"నేను అందరితో మాట్లాడి మీకు, మీరు తీసుకొనబోయే చర్యలకు అందరి సహాయ సహకారాలు అందేలా చేస్తాను. అంతే కాదు. శ్రీహరిరావుతో మాట్లాడి యూనియన్ విషయం ప్రస్తుతానికి మర్చిపొమ్మని చెప్తాను" అన్నాను.

నన్ను ఎంతో మెచ్చుకొని నా సహాయాన్ని జీవితాంతం మర్చిపోలే మన్నారు రుక్మిణీ దేవిగారు. వుత్సాహంగా బయటకొచ్చాను.

* * *

మర్నాడుదయం. కొత్త ఆలస్యంగా వచ్చాను ఆఫీసుకి.

ఆఫీసంతా నిశ్శబ్దం.

అందరి ముఖాల్లో విచారం.

ఎందుకబ్బా అనుకునాను.

ఎవరి కొంప మునిగిందో అనుకున్నాను.

"కేషియర్‌గారు రమ్మంటున్నారు" ప్యూన్‌వచ్చి చెప్పివెళ్ళాడు.

కుబేరునికి కరుణ ఇలా అకాలంగా ఎందుకు కలిగిందా అనుకున్నాను.

కేషియర్ చేతికి రెండు కవర్లిచ్చాడు.

ఒక దాంట్లో డబ్బు.

రెండో దాంట్లో లెటర్.

లెటర్ తెరిచాను.

ఉద్యోగానికి ఉద్వాసన!

కళ్ళు మసకలు కమ్ముతున్నాయి.

అంతా అయోమయంగా ఉంది.

తల దిమ్మెక్కుతూంది.

కేషియర్ దగ్గరకు శ్రీహరిరావు వచ్చాడు.

నాలాగే అతనికీ రెండు కవర్లు

ముందు డబ్బులు లెక్క చూసుకున్నాడు.

ఆపైన లెటర్ చదివాడు.

రెండు కవర్లు జేబులో కుక్కుకొని గబాగబా వెళ్ళిపోయాడు మాటా పలుకు లేకుండా.

"నే చెప్పలా గురూగారు. మన మేడమ్ 'మేన్ ఈటర్' అని" గోప్....

నాకేమి వినబడటంలేదు కాస్తో కూస్తో వినబడ్డా అర్థం కావటంలేదు. ఏం చేయాలో అసలే అర్థం కావటంలేదు.

రుక్మిణీ దేవిగార్ని కలుసుకుందామని ఆవిడ గది దగ్గరకు వెళ్ళాను. ఆవిడ వారం రోజులు శెలవలో వున్నారని ప్యూన్ చెప్పాడు.

* * *

ఆర్నెల్ల తర్వాత తెల్సింది.

కంపెనీకి విపరీతంగా లాభాలు వచ్చినట్లు, ఇరవై పర్సెంట్ బోనస్, అదీకాక అందరికీ మెరిట్ ఇంక్రిమెంట్సు ఇచ్చినట్లు....రుక్మిణీదేవిగారికి ప్రమోషనిచ్చి హెడ్డాఫీసుకి ట్రాన్స్ఫరు చేశార్ట.

అవును మరి....

ఈరోజులు ఎవరివి?

మీవి, నావి కాదు.

బ్రతకనేర్చిన వాళ్ళవి....

[illegible]
[illegible]